
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టింది. ప్రతి శనివారం ఫుట్ పాత్‌పై ఆక్రమణల తొలగింపు కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా నేటి నుంచే ఆక్రమణ తొలగింపు కార్యక్రమం చేపడుతామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేశారు.

## నేపాల్ మాజీ ప్రధాని ఓలీ శర్మ అరెస్ట్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** నేపాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ దేశ మాజీ ప్రధాని కేపీ ఓలీ శర్మ అరెస్టయ్యారు. ఎన్నికలకు ముందు జరిగిన జెన్-జీ నిరసనలను అణచివేశారన్న కేసులో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్త ప్రధానిగా బలేంద్ర షా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే ఆయన అరెస్టు కావడం చర్చనీయాశంగా మారింది. భక్తపూర్‌లోని ఆయన నివాసం నుంచి నేపాల్ పోలీసులు ఓలీని అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు మాజీ హోం మంత్రి రమేష్ లేఖక్‌ను కూడా శనివారం ఉదయం అరెస్టు చేశారు.



## తమిళనాడు ఎన్నికల బరిలో స్టార్ డైరెక్టర్



**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడు ప్రముఖ దర్శకుడు సి. సుందర్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగనున్నారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మదురై సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. అన్నాడీఎంకే కూటమిలోని పీఎన్‌కే పార్టీ తరఫున సుందర్ నిలబడ్డారు. ఈ విషయాన్ని పీఎన్‌కే వ్యవస్థాపక అధ్యక్షుడు వెల్లడించారు.

## మొజ్తాబా చనిపోయే ఉంటాడు: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చనిపోయి ఉంటారని వ్యాఖ్యానించారు. ఇరాన్ నాయకత్వం మొత్తాన్ని తుడిచిపెట్టామని.. మొజ్తాబా కూడా చనిపోయే ఉంటారంటూ మియామిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు.

## అమెరికా స్థావరాలపై భారీ దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో దాడులు తీవ్రమవు తున్నాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. తాజాగా సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై టెహ్రాన్ క్షిపణులతో విరుచుకు పడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై జరిగిన దాడిలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడగా, యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్లు సమాచారం.

## తిరుమలలో 30 నుంచి వసంతోత్సవాలు

**అక్షరటుడే, తిరుమల:** తిరుమలలో ఈ నెల 30 నుంచి శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 30న ఉదయం 6:30కు శ్రీదేవి భూదేవి సమేతంగా నాలుగు మాడవీధుల్లో మలయప్ప స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నారు. రెండో రోజు 31న ఉదయం 8 గం. నుంచి 10 గంటల వరకు మలయప్పస్వామి రథాన్ని ఊరేగించనున్నారు. చివరి రోజు ఏప్రిల్ 1న శ్రీదేవి, మలయప్ప స్వామి.. సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవాలు జరుపనున్నారు.

## ఢిల్లీలో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

**అక్షరటుడే, ఢిల్లీ:** విశాఖ నుంచి ఢిల్లీ వెళ్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఢిల్లీ ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. రన్‌వే 28 దగ్గర ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. బోయింగ్ 737 విమానం 6ఈ 579 విశాఖపట్నం నుంచి ఢిల్లీకి బయలు దేరింది. ఈ విమానాన్ని ఇండిగో, టర్కీకి చెందిన కోరెండన్ ఎయిర్‌లైన్స్ నుంచి వెట్ లీజుకు తీసుకుంది. ఈ ఫ్లైట్‌లో 161 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం ఢిల్లీ సమీపంలోకి చేరగానే ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీనిని గుర్తించిన పైలట్ ఏటీసీకి సమాచారం అందించాడు. అనంతరం అత్యవసరంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశాడు. ప్రయాణికులు సురక్షితంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

**మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన మంచిరేవులలో మాట్లాడారు. కొద్ది మంది స్వార్థ ప్రయోజనాల కోసం మూసీ ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవడానికి కేసులు వేస్తున్నారని విమర్శించారు. ఆరు నూరైనా మూసీ ప్రాజెక్ట్ చేసి తీరుతామని చెప్పారు.**
**–అక్షరటుడే, హైదరాబాద్**



- సీఎం రేవంత్‌రెడ్డి
- మంచిరేవులలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన
- ఆధ్యాత్మిక క్షేత్రంగా మారుస్తామని ప్రకటన

మంచిరేవులలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం పర్యటించారు. మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం, ఆధునిక గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.700 కోట్ల వ్యయంతో 8 ఎకరాల్లో ఆలయం నిర్మించనున్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా ఈ ఆలయం నిర్మించనుండగా.. వంద అడుగులతో భారీ శివుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. శంకుస్థాపన అనంతరం సీఎం మాట్లాడారు. చారిత్రాత్మక ఆలయ పునరుద్ధణ చేపట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

### ఎంతో నష్టపోయాం

మూసీ నదిని ప్రక్షాళన చేయాలని చాలా మంది ముఖ్యమంత్రులు ప్రయత్నించారన్నారు. అవి ముందుకు సాగలేదన్నారు. తాము మాత్రం విమర్శలు వచ్చినా, అడ్డంకులు వచ్చినా మూసీ ప్రాజెక్ట్ చేపడుతామన్నారు. రాష్ట్రంలో నది జలాలను సరైన రీతిలో వినియోగించుకోకపోవడంతో కొన్ని తరాలు నష్టపోయాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. నదులను మనం కలుషితం చేశామన్నారు. మానవ తప్పిదంతో కలుషితమైన మూసీ నదిని ప్రక్షాళన చేస్తామన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో కాలుష్యంతో ప్రజలు బతకలేని పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌కు ఆ పరిస్థితి రాకుండా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

### గోదావరి జలాలు తీసుకొస్తాం


గోదావరి జలాలను మూసీకి తీసుకొస్తామని సీఎం తెలిపారు. 20 టీఎంసీలను హైదరాబాద్ నగరానికి తరలించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. మూసీ కాలుష్యంతో నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆ శివుడే కాపాడతాడు

ఓంకారేశ్వ ఆలయ నిర్మాణంతో మూసీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడతామని సీఎం అన్నారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎదురయ్యే అడ్డంకుల నుంచి ఆ శివుడే కాపాడతాడని చెప్పారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో పాతబస్తీలో మసీదు కడతామన్నారు. అలాగే సిక్కుల కోసం ఓ ఆలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఉప్పల్, నాగోల్ ప్రాంతంలో చర్చిని కడతామన్నారు. రామప్ప ఆలయ నమూనాతో మంచిరేవులలో గుడి నిర్మిస్తామన్నారు. గొప్ప పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పరోక్షంగా విమర్శలు చేశారు. ఆమె కుమారుడు మూసీ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా ఎన్జీటీలో కేసు వేశారన్నారు. కేసు వెనక్కి తీసుకోకపోతే ప్రజలే ఆమెను బహిష్కరిస్తారన్నారు.

## ఇథనాల్ వాడకంపై ప్రధాని కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇథనాల్ వినియోగంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచదేశాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పెట్రోల్ స్థానంలో ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇథనాల్ వాడకం పెరిగితే.. రైతులకు ఆదాయం పెరుగుతుంద న్నారు. అలాగే ముడి చమురు దిగుమతులపై భారతదేశం ఆధారపడడం తగ్గిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలుపుతున్నామన్నారు. ఇక నుంచి దానిని 20శాతానికి పెంచనున్నామని పేర్కొన్నారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడానికి సహకరించిన చెరుకు రైతులకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

## బోయిన్‌పల్లి మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలోని బోయిన్‌పల్లి మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మార్కెట్‌ను పరిశీలించి, ప్రజలు, రైతులు, కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ 24 ఏళ్లుగా కొనసాగుతుందన్నారు. మార్కెట్‌కు నిత్యం సుమారు 10 వేల మంది వస్తారన్నారు. ఏడాదికి రూ.14 కోట్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. అయినా ప్రభుత్వం మార్కెట్‌ను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో నీటి కష్టాలు.. ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీ

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** రాష్ట్రంలో ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. హైదరాబాద్ నగరంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. దీంతో నీటి కోసం నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారు. ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతేగాకుండా చెరువుల్లో నుంచి కలుషిత నీటిని సైతం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కొందరు ట్యాంకర్ల యజమానులు జల మండలి పేరుతో సరఫరా చేస్తున్నారు. వారికి అధికారులు వార్నింగ్ ఇచ్చారు. జలమండలి అధికారిక లోగోను కొందరు వ్యక్తులు, ముఖ్యంగా ప్రైవేట్ నీటి ట్యాంకర్ యజమానులు అనధికారికంగా వినియోగిస్తున్నట్లు జలమండలి దృష్టికి వచ్చింది. అనుమతి లేకుండా లోగో వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.






## ఐపీఎల్ సంగ్రామానికి వేళాయె..

**ఈ వేసవిలో క్రికెట్ అభిమానులకు అసలైన పండుగ మొదలవుతోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ మార్చి 28న ఘనంగా ప్రారంభం కానుంది. ప్రారంభ మ్యాచ్‌లోఆర్సీబీ, సన్‌రైజర్స్ జట్లు చిన స్వామి స్టేడియం వేదికగా తలపడనున్నాయి. చాలా కాలం తర్వాత చిన్నస్వామి స్టేడియంపై ఉన్న నిషేధం తొలగిపోవడంతో ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడిం ది. ఈసారి సొంత మైదానంలో ఆర్సీబీ బలంగా నిలబడాలని చూస్తోం ది. గత సీజన్‌లో ఇక్కడ ఆడిన ఐదు మ్యాచ్‌ల లో ఆర్సీబీ రెండు మాత్రమే గెలి చినప్పటికీ, ఈసారి పరిస్థి తులు మారుతాయని అభి మానులు ఆశిస్తున్నారు.**

- అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్

## లోన్ యాప్స్‌కు మరో యువకుడు బలి



**అక్షరటుడే, ఏపీ:** లోన్ యాప్స్ ఉచ్చులో చిక్కుకొని మరో యువకుడు బలి అయ్యాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో చోటు చేసుకుంది. ఒడిశాకు చెందిన మహ్మద్ బషీర్ (22) కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో చదువుతున్నాడు. అతడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస అయ్యాడు. దీంతో భారీగా డబ్బులు నష్టపోయాడు. ఈ క్రమంలో పోయిన డబ్బులు తిరిగి రాబట్టుకోవాలని లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకున్నాడు. వాటితో ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టగా.. అవికూడా పోయాయి. దీంతో అప్పులు ఎక్కువ కావడంతో వాటిని ఎలా తీర్చలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## క్యాన్సర్ కారకాలతో ఉస్మానియా బిస్కెట్ల తయారీ



**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** ఉస్మానియా బిస్కెట్లను ఎంతోమంది ఇష్టంగా తింటారు. హైదరాబాద్‌లో టీ తాగడానికి కేఫ్‌కు వెళ్తే.. నోరూరించే ఉస్మానియా బిస్కెట్లను సైతం చాలా మంది ఆరగిస్తున్నారు. అయితే వీటిని కూడా అక్రమార్కులు కల్తీ చేస్తున్నారు. క్యాన్సర్ కారకాలతో ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని అంబర్‌పేట్‌లో అక్రమ ఉస్మానియా బిస్కెట్ తయారీ యూనిట్‌పై పోలీసులు దాడులు చేశారు. ప్రమాదకర రసాయనాలు, కుళ్లిన కోడిగుడ్లు, కృత్రిమ రంగులతో బిస్కెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఫ్యాక్టరీ యజమాని మేరజ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.